క్లుప్తంగా

ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల నుంచి ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు 22,834 వచ్చాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. 36 మంది ఆపరేటర్‌లను నియమించామని, వారితో పాటుగా మున్సిపల్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



నందినికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న రంగారెడ్డి, నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డుకు చెందిన శ్రీనివాసరాజు కుమార్తె నందిని అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ. 2లక్షల ఎల్‌ఓసీ మంజూరు అయింది. ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్థానిక మాజీ కౌన్సిలర్ అనుపమ, నందినికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణారెడ్డి, సంతోశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



టీపీఎల్-9 క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరులో టీపీఎల్-9 పోటీలను ఆయన స్థానిక ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, క్రీడాకారులతో కలిసి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కల్గిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీహరిముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు నర్సిరెడ్డి, జంగయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ నర్సింహాయాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు గోవర్ధన్ చారి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య, సురేందర్‌రెడ్డి గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోవాలి



అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి పాండు

కందుకూరు: నిస్వార్థంగా, స్వచ్ఛందంగా లయన్స్‌క్లబ్ ప్రజలకు అందించే సేవలను వినియోగించుకోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు తెలిపారు. కందుకూరు, ఆమన్‌గల్లు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ రోజు వారాంతపు అంగడి ఉందని, దీంతో వివిధ దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఆకలి తీర్చడం గొప్ప విషయమన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా మీల్స్ ఆన్ వీల్స్ పేరుతో ఉచిత అన్నదాన వితరణ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ మల్టీపుల్ జిల్లా నిర్వహిస్తుందన్నారు. ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సందడి నరేందర్‌రెడ్డి కుమారై అంకితారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వారి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, కందుకూరు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లుగుప్తా, ఆమన్‌గల్లు క్లబ్ సభ్యులు రాజేందర్, బిచ్చానాయక్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- ఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎస్‌టీయూ నేతలు

ఆమనగల్లు: విద్య కేవలం ఉద్యోగం కోసం కాకుండా.. విలువలు, విజ్ఞానాన్ని అందించే విధంగా ఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నేటి సమాజంలో విలువలతో కూడిన విద్య అవసరమని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ అసోసియేట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, హైదరాబాద్‌లో కసిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయనను ఎస్‌టీయూ నాయకులు ఘనంగా సత్కరించి.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి భార్గవి, రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బాలనర్సింహ, నాయకులు పరమేశ్, తాహెర్ అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రామలక్ష్మయ్య, మక్బూల్, శ్రీనివాసాచారి, రమేశ్, రాజమల్లయ్య, నవీన్, బాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

స్వేచ్ఛను హరిస్తున్న ‘తొలి మెట్టు’

ఎస్టీయూ టీఎస్ అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్



మంచాల: ప్రైమరీ స్కూల్ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో తొలి మెట్టు కార్యక్రమానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ఈ పథకంపై ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బోధనలో ఉపాధ్యాయుల స్వేచ్ఛను హరిస్తున్న తొలి మెట్టు, ఉన్నతి కార్యక్రమాలను పునఃసమీక్షించాలని ఎస్టీయూ టీఎస్ అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్ ప్రభుత్వాన్ని ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. వివిధ ప్రోఫార్మాలు, యాప్‌ల పేరుతో క్లరికల్ పనులు చేయించడం సమంజసం కాదని, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. డిప్యూటేషన్లపై పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

జ్ఞానంతోనే దేశాభివృద్ధి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆమనగల్లు: జ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శంకర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జ్ఞాన ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో శంకర్ మాట్లాడుతూ మహనీయులు జ్ఞానం ద్వారానే సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. సామాజిక, సంస్కృతిక, ఆర్థిక రంగాల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ విద్యతోనే భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, జ్ఞానం ద్వారానే సమాజంలో చైతన్యాన్ని రగిలించారని పేర్కొన్నారు. మహనీయులు చూపిన దారిలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలు, మహేశ్, రాజ్‌కుమార్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం.. మానసికోల్లాసం

పీసీసీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో సూపర్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల పట్ల దృష్టి పెట్టాలని అన్నారు. క్రీడల వలన ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, సీఐ కాశీ విశ్వనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మోదీనే ప్రధాని

బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు తిరుపతి

తలకొండపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు తిరుపతి ఆశాభావ వ్యక్తం చేశారు. మళ్లీ నరేంద్రమోదీ ప్రధానమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు అర్హులకు అందుతున్నాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ

పూజలో పాల్గొన్న రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న స్వాములు, నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అయ్యప్ప మహాపడి పూజలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం మంగల్‌పల్లి పటేల్‌గూడ మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామస్మరణతో పటేల్‌గూడ మార్మోగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మాజీ జెడ్పీటీసీ అయిలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, సురేందర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

మల్‌రెడ్డికి ఘన సత్కారం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో ముజ్జబాఖాన్, నాయకులు

కడ్తాల: మండలం కర్కల్‌పహాడ్ గ్రామంలో హైదరాబాద్ వీఐపీస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను వీఐపీస్ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ముజ్జబాఖాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాము నాయక్, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణ, వీరయ్య, మల్లయ్య, యాదయ్య, అయోధ్య, పాషా, రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్లాజీగౌడ్

ఆమనగల్లు: మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లాజీగౌడ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితులపై చర్య తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, మండలశాఖ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, నాయకులు సతీశ్‌గౌడ్, నర్సింహాగౌడ్, నారాయణగౌడ్, లక్ష్మీపతి, బాలకృష్ణగౌడ్, శివ, నరేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన

మాడ్గుల: మాడ్గుల మండల పరిధిలోని అవురుపల్లిలో గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో గౌడ సంఘాల నాయకులు ఆదివారం అవురుపల్లి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాలుక గౌడ సంఘం అధ్యక్షుడు అల్లాజీగౌడ్, నాయకులు నారాయణగౌడ్, లాలయ్యగౌడ్, నిరంజన్ గౌడ్, దళపతిగౌడ్, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆన్‌లైన్ ప్రక్రియ



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి

తుక్కుగూడ: దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ప్రజాపాలన మహేశ్వరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా 8,355 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారుడు ఫారంలో పేర్కొన్న కుటుంబ వివరాలు, ఆరు గ్యారంటీ పథకాలతో ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

ఆన్‌లైన్‌లో నమోదుకు కసరత్తు



కంప్యూటీకరణ పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు నిమగ్నం అయ్యారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించి లబ్ధిదారులు దరఖాస్తు పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ సుమన్‌రావు, ప్రజాపాలన ఇన్‌చార్జి అధికారి రాజేశ్వర్‌రెడ్డి, మేనేజర్ నగేష్‌బాబు ఆదివారం నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్పొరేషన్‌లోని 32 డివిజనల్లో మొత్తంగా 32,147 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగానే ఇంటికి పరిశీలన నిమిత్తం అధికారులు రానున్నారు. ఈ నెల 17 తేదీ లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ కార్యక్రమంలో హిందువులంతా పాల్గొనాలని కౌన్సిలర్ అనురాధ కోరారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. హిందువులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయాల్లో పూజలు నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేస్తున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డులో మాజీ కౌన్సిలర్ అనుపమ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



అక్షింతలు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ అనుపమ

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే ఓటమి పాలైందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక చట్టాలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యదర్శిగా నర్సింహ

ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కార్యదర్శిగా నర్సింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామేల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్, బుగ్గరాములు, ఎల్లేశ్, బాబు, రమేశ్, యాదయ్య, పుష్ప, జయమ్మ, అండాలు, లింగమయ్య, శివరాజ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వేదిక



ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఒకటి కాదు.. రెండు కాదు. ఏకంగా నాలుగు దశాబ్దాల తర్వాత స్నేహితులు కలుసుకున్నారు. కలిసి చదువుకున్న వారంతా ఒకరిని ఒకరు గుర్తు పట్టలేనంతగా మారిపోయారు. అయినా పరిచయం చేసుకొని నాటి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులంతా హైదరాబాద్‌లోని బాలాపూర్ సామల పాపిరెడ్డి గార్డెన్స్‌లో సమ్మేళనం జరుపుకున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఖాజామైనోద్దీన్‌ను సత్కరించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బికుమాండ్ల వెంకట్, భిక్షపతి, జంగయ్య, గోవర్ధన్‌రెడ్డి, రమేశ్, ఆంజనేయులు, శశిరేఖ, అరుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వీరు భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చదవుకున్న రోజుల్లో జ్ఞాపకాలను పంచుకుంటూ ఉబ్బితబ్బిబయ్యారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. గ్రూప్ ఫొటోలు దిగి కొత్త జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

సంబరాల్లో భాగస్వాములు కావాలి

- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేయాలి
- సీజీఆర్ సంస్థ అధ్యక్షురాలు లీలా

కడ్తాల: విద్యార్థులకు పండుగల విశిష్టతను వివరించి పండుగ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నామని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షురాలు లీలా అన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో ఆదివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, బాలచైతన్య కేంద్రాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. భోగి మంటలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు గాలిపటాలు ఎగురవేయడం, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంప్రదాయ పద్ధతిలో పాలు పొంగించారు. అంతకుముందు జరిగిన సభలో లీలా మాట్లాడుతూ రోజురోజుకు కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు పురుషోత్తంరెడ్డి, నర్సింహారెడ్డి, ది ఎర్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయి భాస్కర్‌రెడ్డి, బాలచైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, కో ఆర్డినేటర్లు దీపిక, మౌనిక, శిరీష, మమత, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్, కోటయ్య, బీరేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు